చారిత్రక దర్పణాలు..


పురాతన మసీదులు


రెండో పురాతన (మస్జిద్ఏ రహమానియా) బహర్‌పేట్ మసీదు


మద్రాసు సంప్రదాయ రీతిలో నిర్మితమైన జామియా చౌక్ మసీదు


రాయదుర్గంలో తొలి ప్రాచీన మసీదు టిప్పుసుల్తాన్ జామియా మసీదు

● నేటికీ నమాజ్‌లతో ఆధ్యాత్మిక శోభ


మక్కా మసీదు (చిన్న మసీదు)

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో చారిత్రక చిహ్నాలుగా, శతాబ్దాల దర్పణంగా అనేక పురాతన మసీదులు ఉన్నాయి. నేటికీ చెక్కు చెదరకుండా ఆ మసీదులు నమాజులతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. రాయదుర్గాన్ని పాలేగాండ్ర రాజులు పాలిస్తున్న కాలంలో మహమ్మదీయులు ఇక్కడికి వచ్చి స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నారు. చారిత్రక కథనం మేరకు రాయదుర్గంలో మొట్టమొదటి ప్రాచీన మసీదు 24వ వార్డు గొందిబావి ఏరియాలోని టిప్పు సుల్తాన్ జామియా మసీదు. క్రీ.శ 17వ శతాబ్దంలో (1779 ఆగస్టు) అంటే దాదాపు 245 ఏళ్ల క్రితం నాటి టిప్పు సుల్తాన్ మసీదు. అప్పట్లో ముస్లింల ఆహ్వానంతో పాటు టిప్పు సుల్తాన్ తన సామ్రాజ్య విస్తరణలో భాగంగా రాయదుర్గం వచ్చిన సమయంలో ఇక్కడ నమాజ్ చేసినట్లు ముస్లిం పెద్దలు చెబుతారు. తన సామంత రాజుల ద్వారా మసీదును ఆధునీకరించగా అప్పటి నుంచి టిప్పు సుల్తాన్ జామియా మసీదుగా స్థిరపడింది.

మరికొన్ని పురాతన మసీదులు ఇవిగో...

రాయదుర్గంలో క్రీ.శ 18, 19 శతాబ్దాల్లో నిర్మించిన మరో ఆరు ప్రాచీన మసీదులు దర్శనమిస్తున్నాయి. కాలక్రమేణా వీటిలో కొన్ని ఆధునీకరించారు. తొలి మసీదు టిప్పు సుల్తాన్ తర్వాత రెండో మసీదు కుంబారుగుండావీధి నేసేపట కొండ దిగువన 1864లో నిర్మించారు. 161 సంవత్సరాల చరిత్ర గల ఈ మసీదు 'బహార్‌పేట మసీదు' అని అంటారు. పట్టణంలో స్థిరపడిన లబ్బేలు (చర్మ వ్యాపారస్తులు) అప్పట్లో మద్రాసు సంప్రదాయ పద్ధతిలో ఆత్మకూరు వీధి కొండదిగువన 1890లో నిర్మించిన 'జామియా చౌక్ మసీదు' మూడో మసీదుగా పిలుస్తున్నారు. క్రీ.శ 1894లో ఓబుళాచారి రోడ్డులో నిర్మించిన మక్కా మసీదు (అప్పట్లో చిన్న మసీదు) పురాతన నాల్గవ మసీదు. బళ్లారి రోడ్డు అరబిక్ కళాశాల పక్కన దివంగత సయ్యద్ ఇస్మాయిల్ సాబ్‌చే 1954లో నిర్మించిన జామియా మహమ్మదీయ అహ్లె హదీస్ మసీదు ఐదో మసీదుగా చెప్పవచ్చు. ఆరవ పురాతన మసీదు 1958లో కోట ముఖ ద్వారా పక్కనే నిర్మించారు. దీన్నిన ఫోర్ట్‌గేట్ మసీదుగా పిలుస్తారు. తర్వాత రాణిఛత్రం వెనుక భాగంలో 1980లో నిర్మించిన మస్జిద్ ఏ కుబా అని అంటారు. రాయదుర్గం పట్టణంలో పురాతన 7 మసీదులతో పాటు మరో 21 మసీదులు ఉన్నాయి.


జామియా మహమ్మదీయ అహ్లె హదీస్ మసీదు


కోటముఖ ద్వారం పక్కన గల ఫోర్ట్‌గేట్ మసీదు

తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

తరచూ మోటార్ల మరమ్మతుతో నీటి కష్టాలు

రాయదుర్గం టౌన్: పట్టణంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శాశ్వత తాగునీటి పథకం కింద సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీరు సమృద్ధిగా ఉన్నా నీటి కష్టాలు తప్పడం లేదు. రెండు రోజులకోమారు వచ్చే నీరు అధికారుల అలసత్వంతో మూడు లేదా నాలుగు రోజులకోసారి వదులుతున్నారు. నీటి పథకం నిర్వహణ, తాగునీటి సరఫరాపై సరైన పర్యవేక్షణ లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. కణేకల్లు నుంచి వీరాపురం పంప్‌హౌస్, ఎస్ఎస్ ట్యాంకు వద్ద పంపింగ్ మోటార్లు తరచూ మొరాయిస్తుండడంతో నీటి సమస్య తలెత్తుతోంది. ప్రస్తుతం నాలుగైదు రోజుల నుంచి నీరు సరఫరా కావడం లేదు. మోటార్ల మరమ్మతుల సమయంలో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. రెండు ట్యాంకర్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పట్టణ జనాబా 75 వేల దాకా ఉంది. ఈ రెండు ట్యాంకర్ల ద్వారా పూర్తిస్థాయిలో ప్రజలకు నీరందడం లేదు. పట్టణంలో పైప్‌లైన్ సౌకర్యం సక్రమంగా లేని వాల్మీకి నగర్, బీటీపీ రోడ్డు, పైతోట, ఎంసీఏ హౌసింగ్ కాలనీలకు ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేస్తున్నారు. నీటి కష్టాలపై మున్సిపల్ ఏఈ నరసింహులును వివరణ కోరగా వీరాపురం పంప్‌హౌస్‌లో మోటారు రిపేరీ కారణంగా సరఫరాలో జాప్యం జరిగిందన్నారు. అన్ని ఏరియాలు నీటి సరఫరాను కవర్ చేసే క్రమంలో కొద్దిగా ఆలస్యమవుతోందన్నారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తి చేసి సరఫరా చేస్తున్నామని, అంతేకాక స్టాండ్‌బై మోటార్లను అందుబాటులో ఉంచి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.


ట్యాంకర్ వద్ద నీటి కోసం అవస్థలు పడుతున్న జనం

సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలి

ఉరవకొండ: ఇటీవల ఉరవకొండ వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో పలు ఫైళ్లు దగ్ధమైన ఘటనపై రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అగ్ని ప్రమాద ఘటనలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రమేయం ఉందని చేసిన ఆరోపణలను ఖండించారు. మంత్రి కేశవ్ డైరెక్షన్‌లో నియోజకవర్గంలోని టీడీపీ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ స్వయంగా విలేకరులతో మాట్లాడుతూ.. కాలిపోయిన ఫైల్స్‌లో 2013 ఆ తరువాతవి ఉండొచ్చని స్పష్టంగా చెప్పారన్నారు. అయినా అందులో ముఖ్యమైన ఫైల్స్ ఉన్నాయని.. వాటిని ఉద్దేశపూర్వకంగా కాల్చేశారని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ ముఖ్య నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టేందుకు చూస్తున్నారన్నారు. మంత్రి కేశవ్, టీడీపీ నాయకులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. మీలాగ దోపిడి పాలన సాగించి కుట్రలు, కుతంత్రాలు చేయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, పార్టీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు మేకల సిద్దార్థ్, పార్టీ పట్టణ, రూరల్, మండల సమన్వయకర్తలు ఈడిగ ప్రసాద్, ఎర్రిస్వామి రెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బసవరాజు, పార్టీ నాయకులు లత్తవరం గోవిందు, జోగి వెంకటేష్, కమ్మటి రామాంజనేయులు, పచ్చి రవి, ఈశ్వర్, వేమన్న, జీఎంఎస్ మీరం, శర్మాస్, అసీఫ్, మైనుద్దీన్, రఫీ, కొలేగొండ్ల శేఖర్, విక్కీ, సతీష్, చిన్న భీమా, మహనంది, వడ్డే ఆంజనేయులు, లాలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగాలి

ఉరవకొండ: దేశంలో ఈవీఎంల ద్వారా జరుగుతున్న ఎన్నికలపై ప్రజల్లో అనేక సందేహాలు నెలకొన్నాయి. అగ్రదేశం అమెరికాలో సైతం పోస్టల్ బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మన దేశంలో కుడా పోస్టల్ బ్యాలెట్‌లోనే ఎన్నికలు నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎలక్ట్రోల్ రిటర్నింగ్ ఆఫీసర్ తెప్పేనాయక్‌కు వైఎస్సార్‌సీపీ నేత ఏసీ ఎర్రిస్వామి విన్నవించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులపై అన్నీ రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. నాయకుడు ఏసీ ఎర్రిస్వామి మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు. జాబితాలో మృతి చెందిన వారి పేర్లు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఓటర్లు కుడా జాబితాలో ఉన్నాయని.. వీరిని కుడా తొలగించాలన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం జరిగితేనే బోగస్ ఓటర్లను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. తప్పకుండా ఎన్నికల సంఘానికి ముఖ్యమైన సూచనలు పంపుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ఆర్ఐ, వీఆర్ఓలు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీలతో సమావేశమైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తెప్పేనాయక్

సంక్షిప్త సమాచారం

వాతావరణానికి అనుగుణంగా పంటల సాగు

కళ్యాణదుర్గం రూరల్: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎకాలజీ సెంటర్‌లో 12 గ్రామ కమిటీ సభ్యులకు వ్యవసాయం రంగంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'వాతావరణ మార్పులు - వాటి ప్రభావం - పరిష్కారం' గురించి రైతులకు వివరించారు. భూమి పరిరక్షణకు రైతులు అవలంభించాల్సిన విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీబీఓ కోఆర్డినేటర్ భాస్కర్, కార ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ హనుమంతురాయుడు, ఎకాలజీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి

గుమ్మఘట్ట: తమకు పనిభారం తగ్గించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాల కారణంగా పండుగ దినాలు, సెలవు దినాలను వినియోగించుకోలేక అనారోగ్యాలకు గురవుతున్నామని పేర్కొన్నారు. అధిక పనిభారం వల్ల కుటుంబ సభ్యులతోనూ సమయం గడపలేక పోతున్నామని విన్నవించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు కొల్లప్ప, భీమేష్, వేణుగోపాల్‌రెడ్డి, బసవరాజు, హేమంతరాజు, శ్రీరంగారెడ్డి, మధు, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఇఫ్తార్ విందు

రాయదుర్గంటౌన్: పవిత్ర రంజాన్ మాసంలో సామూహిక ఇఫ్తార్ విందులతో సోదరభావంతో పాటు దాతలకు పుణ్యఫలం లభిస్తుందని మక్కా మసీదు ఇమామ్ ముఫ్తి నూర్‌మొహమ్మద్ తెలిపారు. స్థానిక ఓబుళాచారి రోడ్డులోని మక్కా మసీదులో బుధవారం సాయంత్రం ఉపవాస దీక్ష అనంతరం కాలనీకి చెందిన యువకుల ఆధ్వర్యంలో సామూహిక ఇఫ్తార్ విందు ఇచ్చారు.

ఓవర్‌లోడ్‌తో వెళితే చర్యలు తప్పవు

కణేకల్లు: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళితే చర్యలు తప్పవని ఆటోడ్రైవర్లకు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. కణేకల్లు ఆటోస్టాండ్‌లో బుధవారం ఆటోడ్రైవర్లతో పోలీసులు సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్స్రూ ఆర్‌సీలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కణేకల్లు ఎస్ఐ నాగమధు, ఏఎస్ఐలు ఈశ్వరయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణపై అవగాహన

బ్రహ్మసముద్రం: మామిడి తోటల్లో అధిక దిగుబడి పొందాలంటే మామిడిలో సస్య సంరక్షణ చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పాల వెంకటాపురం, సంతేకొండాపురం గ్రామాల్లో పర్యటించి మామిడి తోటలో తామర పురుగు, తేనే మంచు పురుగులపై జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు. మామిడిలో అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

బొమ్మనహాళ్: కాలువపల్లిలో బుధవారం పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. సుమారు రూ.కోటి భక్తుల విరాళాలతో నూతన రాతి స్తంభాల దేవాలయంతో పాటు కలశ శిఖర గోపురం నిర్మించారు. ఈ సందర్భంగా జాతర నిర్వహించడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చిన్న గౌస్, ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ అలీ, ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు బందోబస్తు చేపట్టారు.


పెద్దమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

సంగమేశ్వరుడి గోపురాలకు రంగులు

కూడేరు: పార్వతీ పరమేశ్వర స్వయంభూ జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వచ్చే నెలలో జరుగనున్నాయి. బుధవారం ఉరవకొండ మండలం నింబగల్లుకు చెందిన కోకా ప్రకాష్ అనే భక్తుడు ఆలయ గాలి గోపురాలకు రంగులు వేయించేందుకు ముందుకొచ్చాడు.

రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

బొమ్మనహాళ్: రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు దగ్గరుండి భూములు సర్వే చేయించుకోవాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. బుధవారం మండలంలోని నేమకల్లు, హరేసముద్రం గ్రామాల్లో భూ సర్వేపై రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తహసీల్దార్ రైతులతో కలిసి పర్యటించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రైతులందరూ సర్వే బృందాలకు తమ పట్టాదారు పాసు పుస్తకం, లింక డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ స్టాంపులు చూపించాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, సర్పంచ్ తిప్పేస్వామి, వీఆర్వో నరసింహులు, నాగరాజురావు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ప్రయోజనాలు

వజ్రకరూరు: రీసర్వేతో రైతులకు ప్రయోజనాలు ఉంటాయని తహసీల్దార్ నయాజ్ అహమ్మద్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి తెలిపారు. బుధవారం వెంకటాంపల్లిలో భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలో మొత్తం 3,499 ఎకరాల భూమి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూమా కమలారెడ్డి, రీసర్వే డీటీ కేశవరెడ్డి, ఆర్ఐ అశ్వర్థనారాయణ, సర్వేయర్ మంజులపాల్గొన్నారు.


హరేసముద్రంలో రీ-సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్

ఇసుక అక్రమ తవ్వకాలు ఆపండి

రాయదుర్గం: అభివృద్ధి పనుల మాటున జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలని బొమ్మనహాళ్ మండలం దేవగిరి సర్పంచ్ రాధిక, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎంసీహెచ్ రాజ్ కుమార్ అధికారులను కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బండూరు గ్రామ శివారులోని వేదావతి హగరి నదిలో జేసీబీ సహాయంతో రోజూ అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారన్నారు. దాదాపు 150 ట్రాక్టర్ల ఇసుకను రాత్రికి రాత్రే కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.


జేసీబీతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

క్లుప్తంగా

విజ్ఞాన విహారయాత్రకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

బొమ్మనహాళ్: ఈ నెల 20, 21 తేదీల్లో బెంగళూరులో జరిగే విజ్ఞాన విహార యాత్ర కార్యక్రమానికి బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్ హైస్కూల్ పాఠశాలలో 9వ తరగతి చదివే జి.గంగోత్రి, పి.హరికీర్తి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు టి.లత తెలిపారు. విద్యార్థులతో పాటు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కె.ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొంటారని వెల్లడించారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

గుమ్మఘట్ట: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షులుగా ఎన్.కొల్లప్ప, ఉపాధ్యక్షులుగా భీమేష్, జనరల్ సెక్రటరీగా మధు, ట్రెజరర్‌గా హేమంతరాజు, సభ్యులుగా వేణుగోపాల్‌రెడ్డి, బసవరాజు, లింగరాజు, శ్రీరంగారెడ్డి, వన్నూరుస్వామి, తేజస్విని ఎన్నికయ్యారు.

రోడ్లు, డ్రెయినేజీ పనుల ప్రారంభం

బొమ్మనహాళ్: నేమకల్లును ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రూ.2.10 కోట్ల నిధులతో 50 సీసీ రోడ్లు, రూ.1 కోటితో 100 డ్రెయినేజీల పనులను బుధవారం పంచాయతీ రాజ్ ఈఈ గార్లపాటి ప్రభాకర్ రెడ్డి, డీఈఈ సుధాకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, బొమ్మనహాళ్ తహసీల్దార్ మునివేలు బుధవారం ప్రారంభించారు. పంచాయతీ రాజ్ ఈఈ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నేమకల్లును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన హామీలో భాగంగా పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు జగదీష్, శ్రీనివాసనాయక్, కోత్తపల్లి మల్లికార్జున, గాలి బసప్ప, శాంతయ్య, ఎంపీటీసీ చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

కుందుర్పి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు కుందుర్పి మండల కన్వీనర్ హనుమంతరాయుడు పిలుపునిచ్చారు. అల్లీ పీరా ఆశ్రమంలో బుధవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా పని చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ నాగరాజు, మాజీ సర్పంచు సుదర్శన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ ఈశ్వరయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు ఈరన్న, శ్రీనివాసులు, సర్పంచులు అతావుల్లా, రామ్మూర్తి, గంగాధర్, విజయ్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ సూచించారు. బుధవారం చాబాలలో దూడలు, గేదెలు, ఎద్దులకు గాలికుంటు వ్యాధి నివారణకు స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. 4 నుంచి 8 నెలల వయస్సు ఉన్న ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల జగదీష్, పశు వైద్యాధికారి కృష్ణమూర్తి నాయక్, జేవీఓ భద్రు నాయక్, వెటర్నరీ అసిస్టెంట్లు మస్తాన్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: పశువుల్లో నాలుగు నెలల వయస్సు ఉన్న పెయ్య దూడల నుంచి ఎనిమిది నెలల వయస్సు దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. బుధవారం గుండ్లపల్లి గ్రామంలో పశువులకు టీకాలు చేశారు.

కబడ్డీ పోటీల్లో వరుణ్ ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: వైఎస్సార్ జిల్లా పులివెందులో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-16 కబడ్డీ పోటీల్లో బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి కె.వరుణ్‌కుమార్ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం కాళీదాసరాజు తెలిపారు. విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా పాఠశాల సిబ్బంది సత్కరించారు. ఎస్ఎంసీ చైర్మన్ రాజశేఖర్ కబడ్డీ కిట్టు బహుమతిగా అందజేశారు. సర్పంచ్ శ్వేత శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సురేష్, గణేష్, ఉపాధ్యాయులు వెంకటేశు, రవి, లక్ష్మి, ఉషారాణి అభినందించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కూడేరు: కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి ఉమాదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

జగన్‌ను కలసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలసిన సోమనాథరెడ్డి

శెట్టూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శెట్టూరు మండలం మాజీ మండల కన్వీనర్, ఎంపీపీ భర్త సోమనాథరెడ్డి మర్యద పూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తన తనయుడు సాయినాథ్‌తో కలిసి పుష్పగుచ్చం అందించారు. పార్టీ కోసం శ్రమించి పనిచేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కరిమల్లె రామచంద్రప్ప(70) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో మెట్టుతోపాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొల్ల రామాంజనేయులు, సర్పంచ్ ఉలిగప్ప, ఎంపీటీసీ చంద్ర, మాజీ జెడ్పీటీసీ గోవిందప్ప, ఆయతపల్లి రామకృష్ణ, మధ్యాన్నప్ప, క్రిష్టోఫర్, ఆర్‌సీ జయన్న, రుద్రముని, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే పంట కల్లం


రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న విత్తనాలు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లుకు పోయే రోడ్డుపైనే రైతులు పంట కల్లం వేసుకున్నారు. కర్ణాటక - ఆంధ్రా సరిహద్దు అయిన ఈ రహదారిపై చుట్టుపక్కల గ్రామాల రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను కోసి తూర్పారబట్టి ఆరబోసేందుకు రోడ్డును కల్లంగా మార్చుకున్నారు. ఒక కిలోమీటర్ మేర మొక్కజొన్న విత్తనాలు ఆరబోశారు. అయితే ఇది వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతోంది. నేమకల్లుకు వేలాదిమంది భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు ఈ మార్గంలోనే వస్తుంటారు. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే పక్కకు పోయే పరిస్థితి లేదు. దీనికి తోడు కంకర మిషన్ల లారీలు ఎక్కువగా ఈ రోడ్డు మార్గంలోనే తిరుగుతుంటాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వై.భీమిరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కె.ప్రభాకర్‌రెడ్డి (65) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పార్టీ యువనేత వై.భీమిరెడ్డి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కె.ప్రభాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, పార్టీ జిల్లా నాయకుడు కె.హనుమంత రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వర రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుధీర్ రెడ్డి, చాబాల సర్పంచు మల్లెల జగదీష్, నియోజకవర్గ నాయకుడు తిప్పారెడ్డి, బీసీ సెల్ మండల కార్యదర్శి సత్య తదితరులు పాల్గొన్నారు.